క్లుప్తంగా

వైభవంగా శిఖర కలశ ప్రతిష్ఠ



పూజల్లో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో పట్టాభిరామస్వామి ఆలయంలో శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం వేదపండితుల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చనలు, హోమాలు, గ్రామోత్సవం ఘనంగా సాగాయి. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్న సంతర్పణ చేశారు. పూజల్లో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

బేస్తవారిపేట: పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి జక్కం మెర్సీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీలుగలు 10 కిలోలు రూ.1230 కాగా సబ్సిడీ రూ.615, జనుములు 10 కిలోలు రూ.1090 కాగా సబ్సిడీ రూ.545, పిల్లి పెసర 8 కిలోల విత్తనాలు రూ.1440 కాగా రూ.720 సబ్సిడీ వర్తింస్తుందని వివరించారు. జనుము, జీలుగ, పిల్లి పెసర మూడు రకాల విత్తనాలు 10 కేజీల ప్యాకెట్ రూ.1296 కాగా రాయితీపై రూ.648కు అందజేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

అర్థవీడు గురుకులానికి రెండు అవార్డులు



బలరామిరెడ్డి

బేస్తవారిపేట(అర్థవీడు): స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు రెండు అవార్డులు వచ్చినట్లు ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో నూరు శాతం ఫలితాలు సాధించడంతో రాష్ట్ర స్థాయిలో బెస్ట్ స్కూల్ అవార్డు, బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాలల్లో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థి పి.కోటేశ్వరరావు 576 మార్కులతో బెస్ట్ స్టూడెంట్ అవార్డుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల, పాఠశాల అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

20న జాతీయ సమ్మెకు నోటీసులు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న మెప్మా ఆర్పీలు

గిద్దలూరు రూరల్: ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో మెప్మా అధికారి ప్రసాద్‌కు ఆర్పీలు మంగళవారం నోటీసులు అందజేశారు. సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నామని ఆశా వర్కర్లు డాక్టర్ భార్గవ్‌రెడ్డికి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్ అమలు తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నట్లు తెలిపారు.

వేడుకగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠ

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పోలేరమ్మతల్లి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. వాస్తు సిద్ధాంతి, ప్రతిష్ఠాచార్యులు పండిత దైవజ్ఞశర్మ ఆధ్వర్యంలో కంకణధారులతో హోమాలు నిర్వహించారు. రాత్రికి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పౌరాణిక నాటకం ఏర్పాటు చేశారు. బుధవారం పూజలతోపాటు విగ్రహాల గ్రామోత్సవం, రాత్రికి విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

- 30 లీటర్ల నాటు సారా స్వాధీనం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పలు గూడేల పరిసర ప్రాంతాల్లో అక్రమ నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం విస్తృత దాడులు నిర్వహించి భారీగా నాటుసారా స్వాధీనం చేసుకోవటంతో పాటు ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడులకు సంబంధించి సీఐ ముక్కు వెంకటరెడ్డి కథనం మేరకు మండల పరిధిలోని వై.చర్లోపల్లి పరిసర ప్రాంతాల సమీపంలో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో దాడులు చేసి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు నల్లగుంట్లకు చెందిన దాసరి రామయ్యను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన మెగావత్ చందూనాయక్ అనే వ్యక్తిని కేసులో నిందితునిగా చేర్చారన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

సూదీ లేదు.. దూదీ లేదు!

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలకు సెలవు
- సేవలపై కొరవడిన పర్యవేక్షణ
- ఇన్‌చార్జి డాక్టర్లతో రోగులకు తప్పని అవస్థలు
- సక్రమంగా సేవలందించాలని ప్రజల విజ్ఞప్తి



సంజీవరాయుడుపేటలో సోమవారం రాత్రి మూతపడిన వైద్యశాల



గిద్దలూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ



యూపీహెచ్‌సీలో ఖాళీగా దర్శనమిస్తున్న బెడ్లు

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ ఆస్పత్రులపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పేద ప్రజలకు సరైన వైద్యసేవలు అందడం లేదు. పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం, సేవలు అందిస్తున్న తీరుతో విసుగు చెందిన ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి చేతి చమురు వదిలించుకుంటున్న పరిస్థితి. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఉన్నతాధికారులు ఇస్తున్న ఆదేశాలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

గిద్దలూరు పట్టణంలోని నంద్యాల రోడ్డులో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న షరీఫ్ పీజీ చదివేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో చెన్నై వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో టిడ్కో గృహాల వద్ద గల జగనన్న కాలనిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ భార్గవ్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు. గతంలో డాక్టర్ షరీఫ్ ఉండే సమయంలో ఓపీల సంఖ్య 150 వరకు ఉండేది. ఇన్‌చార్జిని నియమించిన తర్వాత ఓపీల సంఖ్య 50కి పడిపోయింది. గత ప్రభుత్వంలో అధునాతన హంగులతో నిర్మించిన ఈ వైద్యశాలలో బెడ్లు ప్రస్తుతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పట్టణ నడిబొడ్డున ప్రజలకు అందుబాటులో ఉన్న వైద్యశాలలో రెగ్యులర్ వైద్యుడిని నియమించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గిద్దలూరు మండలంలోని కె.ఎస్.పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు సక్రమంగా అందుబాటులో ఉండకపోవడంతో రోగులు నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఆమె గిద్దలూరులోని పోలీసు స్టేషన్ రోడ్డులో ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేస్తూ, అక్కడే సమయం గడుపుతోందన్న ఆరోపణలున్నాయి. కె.ఎస్.పల్లె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి వైద్యం కోసం వెళ్లగా అక్కడ డాక్టర్ లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినట్లు తెలిపారు.

సంజీవరాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎప్పుడు మూత పడుతుందో, ఎప్పుడు తెరుస్తారో అంతుచిక్కడం లేదు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ సుమయా నెల్లూరుకు, డాక్టర్ దివ్య తిరుపతికి ఈ ఏడాది మార్చి నెలలో పీజీ చేసేందుకు వెళ్లారు. దీంతో 104 వైద్యుడు జుబేర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. వైద్యశాలలో ఇద్దరు డాక్టర్లు, ఎంఎన్‌ఓ, నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో సేవలు దాదాపు నిలిచిపోయాయి. ఈ పీహెచ్‌సీని సోమవారం రాత్రి 9 గంటలకు మూతవేసిన ఫొటోలు సోషల్ మీడియా హల్‌చల్ చేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి ప్రభుత్వ వైద్యశాలల్లో పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్ద పులి సంచారంపై అప్రమత్తంగా ఉండండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారి నాగరాజు

మార్కాపురం: మండలంలోని గొట్టిపడియ అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం ఫారెస్ట్ డిప్యూటీ ఆఫీసర్ నాగరాజు సూచించారు. మంగళవారం గ్రామ శివార్లలో పెద్ద పులి గేదెను చంపి తిన్న నేపథ్యంలో ఆయన తన సిబ్బందితో కలిసి గొట్టిపడియ, అక్కచెరువు తండా ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు పలు సూచనలిచ్చారు. అడవిలోకి ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని సూచించారు. అటవీ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. వన్య ప్రాణులను చంపవద్దని, ఉచ్చులు, వలలు ఉపయోగించి పట్టుకోవద్దని చెప్పారు. పెద్ద పులులు, ఇతర వన్య ప్రాణులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. పొలాల్లో కంచెలకు అనధికారికంగా విద్యుత్ సరఫరా చేయవద్దన్నారు.

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు అవకాశం



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించుకోవాలని స్థానిక డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌హుస్సేన్ పేర్కొన్నారు. 2019 అక్టోబర్ 15 నాటికి ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇంటి నిర్మాణాల క్రమబద్ధీరణకు ప్రభుత్వం జీఓ నం.30 ద్వారా ఆమోదం తెలిపిందన్నారు. గిద్దలూరు పట్టణంలో ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న అక్రమ కట్టడాలకు చెందిన వారు తమ ఇంటి స్థలం పట్టా, కరెంట్ బిల్లులు, ఇంటి పన్నును పొందుపరుస్తూ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి శాంతకుమారి, సర్వేయర్ ఆంజనేయులు, వీఆర్‌ఓలు వై.పి.రంగయ్య యాదవ్, ఫరీదా, రాజశేఖరరెడ్డి, ఖాశిం, స్వర్ణల తారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వం



మాట్లాడుతున్న ఆంజనేయులు

పొదిలి: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక కష్ట జీవులపై నిరంకుశ విధానాలు అమలు చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఆరోపించారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు నెరసుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. జాతీయ సంపదను ప్రైవేట్ రంగానికి మోదీ ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. విమానశ్రాయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల అమ్మకం, రైల్వే స్టేషన్లు, రైల్వే లైన్లలో కొంత భాగం ప్రైవేట్‌కు అప్పగించారన్నారు. ఎల్‌ఐసీ లాంటి సంస్థల్లో వంద శాతం వాటాలు అమ్మేయడాన్ని తప్పుబట్టారు. అత్యంత చౌకగా అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు దేశ జాతీయ సంపదను అప్పనంగా అప్పజెబుతున్నారన్నారు. కార్మికుల సంక్షేమానికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు మద్దతుగా 20వ తేదీన గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులు, రైతు కూలీలు సమన్వయంతో రాస్తారోకోలు, నిరసనలు నిర్వహించాలని ఆంజనేయులు కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పూసా వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్, జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, గుమ్మా బాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న సీడీపీఓ సుశీలాదేవి

మార్కాపురం టౌన్: మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సీడీపీఓ సుశీలాదేవి సూచించారు. మంగళవారం కిశోరి వికాసం సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని తూర్పువీధి అంగన్‌వాడీ కేంద్రంలో బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పీరియడ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాలతో అనర్థాలు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలను వివరించారు.

కిశోర బాలికలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బుజ్జి, అంగన్ వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కాపురంలో మోస్తరు వర్షం



మార్కాపురం కోర్టు సెంటర్‌లో కురుస్తున్న వర్షం

మార్కాపురం: పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సుమారు అరగంటపాటు వర్షం కురవగా సాయంత్రం 6 గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తీవ్రమైన ఎండతో వారం రోజులుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు వర్షం కారణంగా కాస్త ఉపశమనం పొందారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు, చినమనగుండం, పాతపాడు, నాయుడుపేట తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో ఊడిన వర్షం కురిసింది. కొనకనమిట్లలో ఓ మోస్తరు జల్లులు పడ్డాయి. రోజంతా ఉక్కపోతతో విలవిల్లాడిన జనం వర్షంతో ఉపశమనం పొందారు.



గొట్లగట్టుపై కమ్ముకున్న కారుమబ్బులు

వేడుకగా శివపార్వతుల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రాత్రి శివపార్వతుల కల్యాణం, శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా నగరంశెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకటకృష్ణకిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. బుధవారం నంది సేవ, గురువారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అనధికారిక విద్యుత్ కోతలు

- ఉక్కపోతతో అలమటిస్తున్న ప్రజలు
- చిన్నపాటి గాలులకే గంటలపాటు నిలిచిపోతున్న విద్యుత్

కొమరోలు: మండు వేసవిలో అనధికారిక విద్యుత్ కోతలతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలంలో విద్యుత్‌ను నిరాంటంకంగా అందిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఎడాపెడా విద్యుత్ కోతలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోంది.

రాత్రి వేళ 9 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తే దాదాపు 11 గంటల వరకు అంధకారంలోనే మగ్గుతున్న పరిస్థితి. పారిశుధ్య సమస్య కారణంగా దోమల బెడద ఎక్కువగా ఉండడంతో స్థానిక ప్రజలు జాగారం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

చిన్నపాటి గాలులకే విద్యుత్ బంద్

గత 15 రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులతో రోజుమార్చి రోజు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం, ఈదురుగాలులు వీస్తుండటంతో గంటలపాటు విద్యుత్ నిలిపి వేస్తున్నారు. ఆ సమయంలో ఇంట్లో ప్రజలు ఉక్కపోతకు ఉండలేక, బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉక్కపోతతో చిన్నారుల రోదనలు మిన్నంటుతున్నాయి. గాలి, వాన సమయాల్లో పల్లెలు పూర్తిగా అంధకారంలో ఉంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర ఆరాధన మహోత్సవం

తర్లుపాడు: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ అమ్మవార్ల ఆరాధన మహోత్సవాలు తర్లుపాడులో మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పంచామృతాభిషేకం, గణపతి పూజ, పున్యహవచనం, మండపారాధన నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై స్వామివారి కల్యాణం కనుల పండువగా సాగింది. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

బ్రహ్మంగారి మఠానికి ప్రత్యేక బస్సులు

పొదిలి: బ్రహ్మంగారి ఆరాధన సందర్భంగా పొదిలి ఆర్టీసీ డిపో నుంచి బ్రహ్మంగారి మఠంకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శంకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీ వరకు బస్సులు నడుపుతామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పౌర్ణమి సందర్భంగా అరుణాచలం క్షేత్రానికి భక్తుల సౌకర్యార్థం బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కనరా.. కనరా.. పాలకుడా!

- బ్రహ్మంగారి ఆరాధనకు వేలాదిగా వస్తున్న భక్తులు
- మండే ఎండలో సరైన వసతుల్లేక ఇక్కట్లు



ఎండలో బస్సు కోసం వేచి ఉన్న భక్తులు

గిద్దలూరు రూరల్:

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో పాల్గొనేందుకు వేలాదిగా వస్తున్న భక్తులు నిలువ నీడ లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. విజయవాడ, గుంటూరు, వినుకొండ తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు వైఎస్సార్ కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠం వెళ్లేందుకు గిద్దలూరు మీదుగా ప్రయాణించాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం గిద్దలూరు రైల్వే స్టేషన్ వద్ద దిగిన భక్తులు ఎండ తీవ్రతను తాళలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆర్టీసీ బస్సుల కోసం భగభగ మండే ఎండలో పడిగాపులు కాశారు. గతంలో ఆర్టీసీ, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా భక్తుల సౌకర్యార్థం టెంట్లు, తాగునీరు, భోజన వసతి సైతం ఏర్పాటు చేసేవారు. కానీ ఈ ఏడాది అలాంటివేవి లేకపోవడంతో భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు.

ఘనంగా సీతా నవమి వేడుకలు



సీతానవమి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

మార్కాపురం: పట్టణంలో నెహ్రూ బజారులో పాండు రంగ స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సీతా నవమి వేడుకలు(సీతా దేవి పుట్టిన రోజు) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి మహిళ సీతా మాతను ఆదర్శంగా తీసుకోవాలని, కుటుంబ విలువలు కాపాడాలని కోరారు. వీహెచ్‌పీ జిల్లా దుర్గా వాహిని జి.అపర్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో గుంటక వనజాక్షి, జి.వరలక్ష్మమ్మ, ప్రసన్న, లావణ్య, శాసనాల సరోజిని, పి.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

- వెండి చీరతో అలంకారం



వెండిచీర అలంకరణలో వాసవీమాత అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని మంగళవారం వెండి చీరతో ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం వాసవీ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, రామడుగు రమేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నేటితో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొమరోలు: మండలంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఎస్సీ యాక్షన్ ప్లాన్ ద్వారా మంజూరైన రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మస్తాన్‌వలి ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికిగాను మండలానికి ఎస్సీ రుణాలు మంజూరయ్యాయని, అర్హత కలిగిన వారు 18 నుంచి 50 ఏళ్లలోపు వారు ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.